# కొల్లగొడుతున్నారు..!

**ఆదోని** ఆదోనిలో ఎర్రమట్టి మాఫియా రెచ్చిపోతోంది. నాడు వైసీపీ నాయకులు.. నేడు కూటమి నాయకులు అధికారం మాటున కొండాపురం కొండలను కొల్లగొడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీ ఇచ్చారు.. మైనింగ్ అనుతులు ఇచ్చారనే సాకుతో ఇష్టారాజ్యంగా కొండల్ని పిండి చేస్తున్నారు. రోజూ వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లు ఎర్రమట్టి రవాణా చేస్తూ రూ.కోట్లలో సంపాదిస్తున్నారు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అండతో ఆ పార్టీ నాయకులు ఆదోని బైపాస్ రోడ్డు పక్కనే కొండల్ని హరించేశారు. అక్కడి నుంచి కొండాపురం కొండల్లో వాలిపోయారు. ప్రస్తుతం టీడీపీ కూటమి నాయకులు మేము సైతం అంటూ ఎక్స్‌కవేటర్లతో తవ్వేస్తున్నారు. తమ పంటపొలాలు నాశనం అవుతున్నాయని రైతు శ్రీనివాసులు కన్నీటి వేదనను 'రైతులకు గరుసు దొంగల బెడద' శీర్షికన ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. గరుసు తవ్వకాలకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారని టీడీపీ రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అయితే అలాంటి అనుమతులు లేవు.. తాత్కాలికంగా ఇచ్చిన అనుమతులు కూడా నవంబరు 3వ తేదీకే ముగిశాయి అంటూ మైనింగ్ అధికారులు తేల్చిచెప్పారు. కొండపురం కొండల్లో గరుసు తవ్వకాలకు ప్రస్తుతం పర్యావరణ అనుమతులు (ఈసీ) లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేయడంపై చర్యలు తీసుకుంటామని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. మొత్తం మీద ఆదోనిలో మాత్రం కూటమి నేతలు మరో కేజీఎఫ్ (కొండాపురం గ్రావెల్ ఫీల్డ్)కు తెరతీసి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు.

ఆదోని-ఎమ్మిగనూరు జాతీయ రహదారి-167 పక్కనే బైచిగేరి క్రాస్ రోడ్డు సమీపంలో రెవెన్యూ రికార్డుల్లో ఎస్.కొండాపురం గ్రామం ఉంది. 'ఎస్.కొండాపురం కొండలు' ఆదోని, బైచిగేరి, కపటి గ్రామాల మధ్య సర్వే నంబరు.1 పరిధిలో 768 ఎకరాల విస్తీర్ణంలో గరుసు నిల్వలు ఉన్నాయి. ఇక్కడి ఎర్రమట్టి, క్వారీ అక్రమార్కులకు అడ్డాగా మారింది. అధికారంలో ఎవరు ఉన్నా.. కొండాపురం కొండల్లో ఎర్రమట్టి కాసులు కురిపిస్తోంది. ప్రస్తుతం టీడీపీ నాయకులు అధికారం మాటున అనుమతులు ఉన్నాయంటూ ఎక్స్‌కవేటర్లతో తవ్వేస్తూ రవాణా చేస్తున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు ఎర్ర మట్టికి డిమాండ్ ఉంది. రోజుకు వందలాది టిప్పర్లు రవాణా చేస్తున్నారు. ఒక్కో టిప్పరు దూరాన్నిబట్టి రూ.5 వేలు నుంచి రూ.6 వేలకు పైగా విక్రయిస్తున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకుని ప్రభుత్వ భూములు సంరక్షించాల్సిన రెవన్యూ, గనులు భూగర్భ వనరుల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అండతో ఆనాడు ఎర్రమట్టి మాఫిమా పెట్రేగిపోతే.. ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ సహకారంతో ఎర్రగరుసు తవ్వకాలు చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఆదోని మండలం ఎస్.కొండాపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు.1 పరిధిలో 500 క్యూబిక్ మీటర్లు ఎర్రగరుసు తవ్వకాలకు 90 రోజులకు తాత్కాలిక అనుమతి (టీపీ) ఇచ్చిన మాట నిజమేనని గనులు, భూగర్భ వనరుల శాఖ డీడీ రవిచంద్ర తెలిపారు. అయితే ఆ అనుమతి గడువు ఈ నెల మూడో తేదీతో ముగిసింది. గడువు ముగిశాక పాత ఎన్‌వోసీ, టీపీ చిత్తుకాగితలతో సమానం. అవి ఏమాత్రం చెల్లవని వివరించారు. ప్రస్తుతం ఎవరైనా గరుసు తవ్వకాలకు అనుమతులు కావాలంటే స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అస్సెస్మెంట్ అథారిటీ (ఎస్ఈఏఏ) జారీ చేసే పర్యావరణ అనుమతులు (ఈసీ) తప్పనిసరిగా ఉండాలి. ఈసీ అనుమతులు లేకుండా ఎర్రమట్టి, ఇసుక తవ్వకాలు ఎట్టి పరిస్థితుల్లో చేపట్టకూడదని జాతీయ గ్రీన్ ట్రైబ్యూనల్ (ఎన్‌జీటీ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇందుకు విరుద్ధంగా ఆదోనిలో యంత్రాలతో ఎర్ర గరుసు తవ్వకాలను చేపడుతున్నారు. మైనింగ్ నిబంధనలు ఇంతస్పష్టంగా ఉంటే.. 20 రోజుల క్రితమే మైనింగ్ అధికారులు ఇచ్చిన తాతాల్కిక అనుమతి (టీపీ) గడువు ముగిసినా.. మాకు ఎన్‌ఓసీ ఉందని, మైనింగ్ అధికారుల పర్మిషన్ పేరిట ఎస్.కొండాపురం కొండల్లో ఎక్స్‌కవేటర్లతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఓ పక్క సీఎం చంద్రబాబు నాయకుడు మద్యం, మట్టి, ఇసుక జోలికి వెళ్లవద్దని ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులకు స్పష్టంగా చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సీఎం ఆదేశాలను తెలుగుతమ్ముళ్లు ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఈసీ క్లియరెన్స్, మైనింగ్ అనుమతులతో ఖజానాకు రాయల్టీ చెల్లించి ఎర్రమట్టి తవ్వకాలు, రవాణా చేస్తే ఎవరు కాదనరు. అధికారం ఉంది కాదని ఇష్టారాజ్యంగా కొండల్ని తవ్వేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**రైతుల గోడు పట్టదా..?:**

ఆదోని పట్టణం బండిమెట్ట ప్రాంతానికి చెందిన బీసీ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన బోయ సరోజమ్మ, కుమారుడు బోయ శ్రీనివాసులుకు ఎస్.కొండాపురం రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు.116లో 3.40 ఎకరాలు పొలం ఉంది. మా పొలం పక్కనే కపటి గ్రామానికి చెందిన మాధవ్ ఎక్స్‌కవేటరుతో అక్రమంగా గరుసు తవ్వకాలు చేస్తూ నాలుగు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. గరుసు తవ్వకాలు వల్ల మా పొలం కోతకు గురవుతుందని చెప్పిన మా గోడు పట్టించుకోవడం లేదు.. గరుసు తవ్వకాలు ఆపేసి మాకు న్యాయం చేయాలంటూ తల్లికొడుకులు బోయ సరోజ, శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సూచన మేరకు సబ్ కలెక్టరు మౌర్యభరద్వాజ్, తహసీల్దారు శివరాముడును కలసి ఫిర్యాదు చేశారు. రైతు గోడును ఆంధ్రజ్యోతి వార్తగా ప్రచురించింది. గరుసు తవ్వకాలు చేస్తున్న కపటి టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మాధవ్.. టీడీపీ రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మకు సన్నితుడని స్థానికులు అంటున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అనుమతితో తవ్వకాలు చేస్తున్నారనే పట్టణంలో చర్చించుకుంటున్నారు. అక్రమ గరుసు తవ్వకాల వల్ల తన పొలం కోతకు గురవుతోందని, న్యాయం చేయాలంటూ వాల్మీకి(బీసీ) సామాజిక వర్గానికి చెందిన రైతు శ్రీనివాసులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. పదే పదే బీసీ కార్డు ఉపయోగించే నేతలకు అదే బీసీ రైతు గోడు పట్టదా? అంటూ పలువురు పేర్కొంటున్నారు.

**మైనింగ్ పర్మిషన్ ఉంది**

అనుమతులు తీసుకుని గరుసు తవ్వకాలు చేపట్టాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి చెప్పారు. ఆయన అనుమతితోనే టీడీపీ నాయకుడు మాధవ్‌కు ఎస్.కొండాపురంలో గరుసు తవ్వకాలు చేసుకోవాలని చెప్పాం. మా?ధవ్ పేరిట ఈ ఏడాది సెప్టెంబరు 5న మైనింగ్ అధికారులు టెంపరరీ పర్మిషన్ ఇచ్చారు. వైసీపీ హయాంలో పర్మిషన్‌తో తవ్వారో లేదో మాకు తెలియదు.. మేము మాత్రం పర్మిషన్ తీసుకొనే తవ్వకాలు చేస్తున్నాం. బీసీ మహిళా నాయకురాలిగా 20 ఏళ్లుగా కార్యకర్తల కోసం పోరాడుతున్నాను. అన్ని పర్మిషన్లు తీసుకొని తవ్వకాలు చేస్తున్నాం. నేను ఎట్టి పరిస్థితిలో అవినీతిని ప్రొత్సహించను.

**- గుడిసె కృష్ణమ్మ, టీడీపీ నాయకురాలు, ఆదోని**

**తవ్వకాలకు అనుమతులు లేవు**

ఆదోని మండలం ఎస్.కొండాపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు.1 పరిధిలో 500 క్యూబిక్ మీటర్లు గరుసు తవ్వకాలకు ఇచ్చిన తాత్కాలిక అనుమతి (టీపీ) గడువు ఈ నెల 3న ముగిసింది. ప్రస్తుతం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతి లేకుండా గరుసు తవ్వకాలు చేయడం నేరమే అవుతుంది. విచారించి కఠిన చర్యలు తీసుకుంటాం. నేషనల్ గ్రీన్‌ట్రైబ్యూనల్ ఆదేశాల మేరకు పర్యావరణ అనుమతి (ఈసీ) ఉంటేనే గరుసు తవ్వకాలకు టెంపరరీ పర్మిషన్ ఇస్తారు. ఈసీ అనుమతి లేకుండా ఎవరికి అనుమతులు ఇచ్చే ప్రసక్తే లేదు

# సన్న బియ్యం.. మరింత ఆలస్యం

**జగిత్యాల,** రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పొందేందుకు మరింత ఆలస్యం కానుంది. సన్న బియ్యం పొందడానికి సుమారు మరో ఆరు నెలలు ఆగాల్సిందే. జనవరిలో సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినా ఆచరణ సాధ్యమయ్యేలా లేదు. ప్రస్తుతం వస్తున్న సన్న ధాన్యం బియ్యంగా చేసినా వాటిని వెంటనే వండితే అన్నం ముద్దగా అవుతుందని, అందుకే ఉగాది నాటికి సన్న బియ్యం పంపిణీ పూర్తి స్థాయిలో చేపట్టాలన్న యోచనతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఉన్నారు. దీంతో 2025 జనవరిలో సన్నబియ్యం వస్తాయని ఆశించిన ప్రజలకు నిరాశ తప్పేలా లేదు. పైగా వాటి విషయంలో ఇప్పటివరకు జిల్లా అధికారులు ఎలాంటి ఉత్తర్వులు కూడా రాకపోవడంతో ఉగాది వరకు వేచి ఉండాల్సి రావచ్చని అధికారులు కూడా పేర్కొన్నారు.

**భగ్గుమంటున్న ధరలు...**

ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. కిలోకు రూ. 50 నుంచి రూ. 60 వెచ్చించాల్సి వస్తోంది. వాటి సరఫరా తక్కువగా వినియోగం ఎక్కువగా ఉండటంతో ధరలు పెరిగిపోయాయి. మరోవైపు ప్రభుత్వం పంపిణీ చేసే దొడ్డు బియ్యాన్ని చాలా కుటుంబాలు తినకుండా అమ్ముకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచి రేషన్ కింద సన్న బియ్యం ఇస్తామని ప్రకటించింది. అయితే ఇప్పుడు వచ్చిన ధాన్యం మరాడించి పంపిణీ చేస్తే ఆ బియ్యం వండితే ముద్ద అవుతుందని ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని, మూడు నాలుగు నెలలు మాగితే బాగుంటాయని పౌరసరాఫరాల శాఖ వర్గాలు చెబుతున్నాయి. అందుకు ఉగాది నుంచి పంపిణీ చేసేలా కసరత్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**లబ్ధిదారులకు తప్పని నిరాశ**

జిల్లాలో రేషన్‌కార్డు దారులకు నిరాశ తప్పడం లేదు. ఇన్నాళ్లు దొడ్డు బియ్యం (సాధారణ రకం) తీసుకున్న ప్రజలకు ఇక సన్నబియ్యం వస్తాయని, వాటిని ఎంచక్కా తినొచ్చని భావించినా ఇప్పట్లో ఆ ఆశ నెరవేరేలా లేదు. ప్రస్తుతం జిల్లాలో మొత్తంగా 592 రేషన్ షాపులు ఉండగా, 3,07,127 ఆహార భద్రతా కార్డులు ఉన్నాయి. వాటికింద 8,82,187 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో మూడు రకాల కార్డులు ఉన్నాయి. ఆహార భద్రతా కార్డులు 2,92,450 ఉండగా ఆ కార్డుల్లో పేర్లు నమోదైన ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున 8,44,755 మందికి ప్రభుత్వం ఉచితంగా బియ్యం ఇస్తోంది. 14,532 అంత్యోదయ కార్డులున్నాయి. అంత్యోదయ దారులకు ఒక్కో కార్డు కింద 35 కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేస్తోంది. అన్నపూర్ణ కార్డులు 145 ఉండగా 155 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ఒక్కో కార్డు కింద 10 కిలోల చొప్పున బియ్యం ఇస్తోంది. వారంతా సన్న బియ్యం కోసం ఉగాది వరకు వేచి చూడక తప్పని పరిస్థితి.

**రేషన్ బియ్యం తినేది కొద్ది మందే..**

రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న దొడ్డు బియ్యాన్ని ప్రతి నెలా సుమారు 20 శాతం మేర లబ్ధిదారులు తీసుకోవడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. రేషన్ బియ్యం తీసుకున్న వారిలోనూ 50 శాతం లోపు మందే వీటిని తినడానికి వినియోగించుకుంటున్నట్లు అంచనా వేస్తున్నారు. మిగిలిన వారు తాము కొన్న రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో కిలోకు 10 రూపాయల నుంచి 15 రూపాయల వరకు అమ్ముకుంటున్నారు. ఇవి రీసైక్లింగ్ అవుతున్నాయి. మరికొన్నిసార్లు రేషన్ బియ్యాన్ని అమ్మి బహిరంగ మార్కెట్‌లో 40 రూపాయల నుంచి 60 రూపాయలుపెట్టి సన్న బియ్యాన్ని కొంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఇటు పేదలపైనా ఆర్థిక భారం పడుతున్నది. రేషన్ బియ్యం భారీ మొత్తంలో పక్కదారి పడుతున్నదన్న ఆరోపణలున్నాయి. వ్యాపారులు ఈ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొని మిల్లర్లకు అమ్ముతున్నారన్న విమర్శలున్నాయి. మిల్లర్లు ఈ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సీఎంఆర్‌లో ఎఫ్‌సీఐకి అంటగడుతున్నారని తెలుస్తోంది. ఈనేపథ్యంలో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తారని ఆశించిన లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా రానున్న జనవరి మాసం నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# 'గులాబీ' గుబులు

జిల్లా లోని జగ్గయ్య పేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ఈ ఏడాది లక్ష ఎకరాలకుపైగా రైతులు పత్తి సాగు చేశారు. ఆగస్టు చివర్లో, సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు పత్తి చేలు బాగా దెబ్బతిన్నాయి. జిల్లా అధికారుల నివేదికల ప్రకారం 35 వేల ఎకరాల్లో పత్తి చేలు దెబ్బతిన్నాయి. కొద్ది రోజుల నుంచి పత్తితీతలు జరుగుతున్నాయి. చేలు ఆశాజనకంగా లేకపోవటంతో ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడి రావటం చాలా కష్టంగా మారింది.

**గులాబీ రంగు పురుగు ఉధృతి**

గులాబీ రంగు పురుగు జిల్లాలోనూ కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఉధృతంగా ఉంది. పలు రకాల క్రిమిసంహారక మందులు పిచికారి చేసినప్పటికీ ఈ పురుగు అదుపులోకి రావటం లేదు. పత్తి చేలను నిశితంగా పరిశీలిస్తే దాదాపుగా అన్ని కాయల్లోనూ ఈ పురుగు కనిపిస్తోంది. కాయ పైభాగంలో నల్లటి మచ్చలు తప్పితే పురుగు మాత్రం పైకి కనిపించటం లేదు. లోపలికి చొచ్చుకుపోయి పత్తి తొనలను తినేస్తోంది. పురుగు తాకిడికి పత్తి చేలు దెబ్బతింటున్నాయి.

**నాణ్యమైన పత్తి రావడం లేదు**

ఈ ఏడాది పత్తి పంటకు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. మొదట్లో ఆశాజనకంగా ఉన్న చేలను ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన ఎడతెగని వర్షాలు, వరదలు దెబ్బతీశాయి. వర్షాలకు తేమ ఆరకపోవటంతో గూడ, పూత రాలిపోయింది. ఫంగస్ సోకటంతో కాయలు నల్లగా అయ్యాయి. పక్వానికి వచ్చినప్పటికీ విచ్చుకోలేదు. మొదటి తీత కాపు దెబ్బతింది. ఇప్పుడు గులాబీ రంగు పురుగు దాడి చేసింది. పత్తి తీతలు జరుగుతున్నప్పటికీ నాణ్యత కల్గిన పత్తి రావడం లేదు. పురుగు తినేయగా కాయలో మిగిలిన ఒకటి, రెండు తోనలు కూడా విచ్చుకోవడం లేదు. ఉండల్లా బిగుసుకుపోతున్నాయి. పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరానికి కౌలుతో కలుపుకుని రూ. 50వేలకు పైగా పెట్టుబడి అయింది. ఇప్పటి వరకు ఎకరానికి రూ. 10 వేలు కూడా తిరిగి రాలేదు. పైగా పత్తి తీతకు ఎక్కువ ఖర్చు అవుతోంది. చివరకు కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదని రైతులు వాపోతున్నారు.



**పురుగు తినేసింది**

నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశా. గులాబీ రంగు పురుగు ఉధృతంగా దాడి చేసింది. కాయల్లోపలికి చొరబడి పురుగు తినేస్తోంది. ఒకటికి నాలుగు సార్లు మందులు పిచికారి చేసినప్పటికీ పురుగు చావడం లేదు. ఇప్పటికీ ఎకరానికి ఒక క్వింటా వంతున నాలుగు క్వింటాళ్ల పత్తి మాత్రమే వచ్చింది. చాలా తక్కువ ధరకు అడగటంతో అమ్మలేదు. ఇంకా ఎకరానికి ఐదు క్వింటాళ్ల లోప వస్తోంది. పత్తి నాణ్యత ఉండటం లేదు. దీంతో ఏం చేయాలో పాలుపోవటం లేదు.

**-ముక్కపాటి బాబూరావు, రైతు, గొట్టుముక్కల**

**తీవ్రంగా నష్టపోయాం**

4.5 ఎకరాల్లో పత్తి వేయగా కౌలుతో కలిపి ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి అయింది. ఇప్పటికి రెండు క్వింటాళ్ల వంతున పత్తి రాగా, క్వింటా రూ.5600 వంతున అమ్మాను. ఇంకా నాలుగు క్వింటాళ్ల వంతున మాత్రమే వస్తుంది. రాకాసి పురుగు దాడికి చేలు కకావికలమవుతున్నాయి. పక్వానికి వచ్చిన కాయలను కూడా తినేస్తున్నాయి. సగం పెట్టుబడి కూడా చేతికి దక్కే పరిస్థితి కనిపించటం లేదు. పత్తి రైతులందరూ తీవ్రంగా నష్టపోయారు.

## గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ.



**వెలుగోడు నవంబర్ 23 రిపబ్లిక్ న్యూస్** ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో మంజూరైన గోకులం షెడ్డు నిర్మాణానికి శనివారం నాడు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు అన్నారం శశి రెడ్డి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం పాడి పరిశ్రమలు అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గోకులం షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు.ఇందులో భాగంగానే నేడు రెండు లక్షల 30 వేల రూపాయలతో నిర్మించ తలపెట్టిన గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించడం జరిగింది అన్నారు.ఇంకా ఎవరైనా ఉంటే అటువంటి వారికి కూడా గోకులం షెడ్ల నిర్మాణానికి అనుమతులు ఇప్పించడంజరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణుడు, మాజీ సర్పంచ్ ముల్లా అబ్దుల్ కలాం, తెలుగుదేశం పార్టీ నాయకులు హిదాయత్ అలీ ఖాన్, మోమిన్ రసూల్, ఎల్లాల సురేష్, ధూపం రమణ, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ పంట పరిశీలన.



**వెలుగోడు నవంబర్ 23 రిపబ్లిక్ న్యూస్** వెలుగోడు మండలం మాధవరం గ్రామంలో ఆయిల్ పామ్ పంటను శనివారం నాడు ఉద్యాన శాఖ అధికారి చందన పరిశీలించారు. ఆయిల్ పామ్ రైతులకు లాభదాయకమని, నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ మొక్కలు నాటుకోవడం మంచిదని తెలిపారు. పతాంజలి కంపెనీ వారు మొక్కలని ఉచితంగా ఇస్తారని, గెలలను కూడా తిరిగి కంపెనీ వారే కొంటారని తెలిపారు. ఎకరాకు 57 మొక్కలు నాటుకోవాలని, ఎకరానికి 10 నుండి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. అంతర పంట వేసుకోవడం ద్వారా ఉద్యాన శాఖ నుండి 11500 హెక్టర్ కి సబ్సిడీ ఉందని తెలిపారు. మిరప పంటలో కూడా ఇంటిగ్రేటెడ్ న్యూట్రియంట్ మేనేజ్మెంట్ పథకం కింద రైతులకు 2,400 రూపాయలకు జిగురు అట్ట ముక్కలు వేప నూనె అందిస్తున్నామని, 1200 రూపాయలు రైతులకు సబ్సిడీ వస్తుందని తెలిపారు. మిరప రైతులు ఈ అవకాశాన్ని వినియోగించవలసిందిగా కోరుతున్నారు.

## టిడిపి సభ్యత్వం మీ జీవితాలకు భరోసా.. ఖలీల్.





**వెలుగోడు నవంబర్ 23 రిపబ్లిక్ న్యూస్** తెలుగుదేశం పార్టీ సభ్యత్వం మీ జీవితాలకు భరోసా ,గౌరవమని వెలుగోడు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఖలీల్ ఖాన్ అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రుసుము చెల్లించి తన పేర్లను నమోదు చేసుకుంటున్నారు అన్నారు . ఇందులో భాగంగా శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు 113 బూతులో శనివారం నాడు గండిపేట, మంచినీళ్ల బావి వీధి లో సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు .తెదేపా నాయకులు మైనార్టీ నాయకులు హితాయత్ అలీ ఖాన్ , రెహమాన్,. ఆంజనేయులు, రౌఫ్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి అందరి కృషి అవసరం ఎంపీపీ లాలం రమేష్.

**వెలుగోడు నవంబర్ 23 రిపబ్లిక్ న్యూస్** మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల ,అధికారుల కృషి అవసరమని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు.శనివారం నాడు స్థానిక మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసర సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అధికారులు తమ శాఖపరమైన నివేదిక వెల్లడించారు అనంతరం ఎంపీపీ లాలం రమేష్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, సమయపాలన పాటించి సమావేశం సమర్థవంతంగా జరిగేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్ వివిధ గ్రామాల సర్పంచులు.ఎంపిటిసి సభ్యులు నసిరుద్దీన్,జనాబ్ రెడ్డి, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, శాఖల అధికారులు పాల్గొన్నారు.



